ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025 5 అనంతపురం

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీడీ కార్మికులు

అభివృద్ధికి నోచుకోని బీడీ కార్మికులు

స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించాలి - గుర్తింపు కార్డులను మంజూరు చేయండి

బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులు

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

ఏళ్ల తరబడి బీడీలు చుడుతున్న బీడీ కార్మికులు అభివృద్ధి, సంక్షేమంకు దూరంగా ఉన్నారని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు పేర్కొన్నారు. బీడీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బీడీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రజాక్ వలికు అందజేశారు. ముందుగా స్థానిక ఎన్జీవో హోంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఎంతో కాలంగా బీడీలు చుట్టి కష్టానికి తగ్గ వేతనం లేక అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1000 బీడీలు చుడితే కేవలం రూ.200 మాత్రమే బీడీ కంపెనీలు ఇస్తున్నాయన్నారు. అందులోనూ రూ.25 నుంచి రూ.40 వరకు కోత విధిస్తూ బీడీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నాయని తెలిపారు. బీడీలు చుట్టూ ఆ పొగాకు గాటుకు కార్మికులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. వీరి కోసం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. వెయ్యి బీడీలు చుట్టేవారికి కనీసం రూ.300 రూపాయలు కూలి ఇవ్వాలన్నారు. నిరుపేదలైన బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలన్నారు. పిఎఫ్, చట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కన్వీనర్ ఉమా గౌడ్, బీడీ కార్మిక సంఘం రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, సిఐటియు నాయకులు హనుమంత్ రెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, భాస్కర్, నాగరాజు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

బడా సుబ్బిరెడ్డి కన్నుమూత

బడా సుబ్బిరెడ్డి (ఫైల్‌ఫోటో)

శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలులో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున తుది శ్వాస విడిచారు. కదిరి ప్రాంతానికి చెందిన బడా సుబ్బిరెడ్డి సిపిఎం, రైతుసంఘం నాయకునిగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలందరికీ సుపరిచితుడు. రైతులు, రైతు సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటం సాగించారు. రైతులకు ఎక్కడ సమస్య ఉందన్నా అక్కడికి వెళ్లి వారి సమస్య పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించారు. రైతులను ఏకం చేసి ఉద్యమాలను నిర్మించడంలో ఆయన కృషి ఎనలేనిది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజలకు అండగా నిలుస్తూ నాలుగు దశాబ్దాలుగా సిపిఎం జెండా అడుగుజాడల్లో నిలిచారు.

- నాలుగు దశాబ్దాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర
- రైతు సమస్యలపై నిరంతర పోరాటం
- నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలిచిన నేత
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటు, ప్రముఖుల సంతాపం
- ఎర్రదండు విప్లవ జోహార్ల నడుమ అంత్యక్రియలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బడా సుబ్బిరెడ్డి 1995లో పాడి రైతుల ఉత్పత్తి దారుల సంఘం నాయకునిగా ప్రజా ఉద్యమంలోకి అడుగు పెట్టారు. అక్కడి నుంచి రైతుసంఘం, సిపిఎం నాయకునిగా ఎదిగారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో సిపిఎం కదిరి డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. నాలుగు దశాబ్దాల పాటు సిపిఎంలో ఉంటూ నమ్మిన సిద్ధాంతం కోసం మొక్కవోని దీక్షతో ప్రజాపోరాటాలు సాగించారు. కదిరి ప్రాంతంలోనే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, కార్మికుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సిపిఎం అనుబంధ సంఘాలు ఇచ్చిన ప్రతి పిలుపునూ అందుకుని సుదీర్ఘ కాలంగా అనేక ఉద్యమాలు కొనసాగించారు. కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర ఆందోళనలు కొనసాగించారు. 2014లో ఎన్‌పి.కుంట మండలంలో సోలార్ కంపెనీ ఏర్పాటు సమయంలో రైతులకు మెరుగైన పరిహారం కోసం పోరాటాలు చేశారు. పేద రైతులకు భూములు ఇవ్వాలని సాగించిన భూ స్వాధీన పోరాటంలో పాల్గొని పట్టాలు ఇప్పించగలిగారు.

సుబ్బిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాంభూపాల్ తదితరులు

సుబ్బిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, మద్దతదారులు

పలువురి నివాళి

బడా సుబ్బిరెడ్డి మరణ వార్త తెలుసుకుని పార్టీలకు అతీతంగా పలువురు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ, డా॥గేయానంద్, మాజీ ఎమ్మెల్యేలు డా॥సిద్ధారెడ్డి, అత్తార్ చాంద్‌బాషాలు నివాళి అర్పించారు. వీరితో పాటు అనంతపురం సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, పెనుకొండ హరి, సిపిఎం జిల్లా నాయకులు ఎం.ఇంతియాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిఐటియు సత్యసాయి జిల్లా అధ్యక్షులు జెడ్పి.శ్రీనివాసులు, కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, ఐద్వా నాయకురాలు దిల్షాద్, శాంతబాయి, రంగమ్మ, లక్ష్మీదేవి, మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుపాల్, బాలకష్ణ తదితరులు నివాళి అర్పించారు.

రైతు సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళనలో మాట్లాడుతున్న బడా సుబ్బిరెడ్డి (ఫైల్‌ఫోటో)

వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు

బడా సుబ్బిరెడ్డి అంత్యక్రియలు సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వరిగిరెడ్డిపల్లిలో సోమవారం సాయంత్రం జరిగాయి. సుబ్బిరెడ్డి నివాసం నుంచి ఆయన వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమయాత్రను నిర్వహించారు. 'జోహార్ బడా సుబ్బిరెడ్డి.. జోహార్ బడా సుబ్బిరెడ్డి.. రెడ్ సెల్యూట్ కామ్రేడ్'.. అంటూ అంతిమయాత్రలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నినాదాలు చేశారు. బడా సుబ్బిరెడ్డి భార్య, కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, కుమార్తె కళావతి, కుటుంబ సభ్యులు, వామపక్ష పార్టీల మద్దతుదారుల సమక్షంలో వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియల కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

వి.శ్రీనివాసరావుతో పాటు పలువురి నివాళి

కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి మతి విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. రైతు, ప్రజా ఉద్యమంలో సుబ్బిరెడ్డి ప్రముఖపాత్ర పోషించారని శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, మాజీ ఎమ్మెల్యేలు పివి.సిద్ధారెడ్డి, అత్తార్ చాంద్‌బాషాలు సుబ్బిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళు అర్పించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులుతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు.

ప్రజా ఉద్యమానికి తీరనిలోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

సీనియర్ సిపిఎం నాయకుడు కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. సుబ్బిరెడ్డి మరణవార్త తెలియగానే రాంభూపాల్ ఆయన స్వగ్రామం వరిగిరెడ్డిపల్లికి చేరుకున్నారు. సుబ్బిరెడ్డి నివాసం వద్ద పార్థివదేహంపై సిపిఎం జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సుబ్బిరెడ్డి సుదీర్ఘ కాలంగా రైతాంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు కొనసాగించారని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి ప్రజల పక్షాన నిలిచారని గుర్తు చేశారు.

రోడ్డుపై చెత్త వేసి నిరసన

ఇంటింటి చెత్త సేకరణ నిర్లక్ష్యంపై..

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

క్లాప్ పథకం కింద నగరంలో ఇంటింటి చెత్త సేకరణ చేసే విధానం ఫ్లాప్ కావడాన్ని నిరసిస్తూ వైసిపి కార్పొరేటర్ అబుసాలేహా వినూత్నంగా నిరసన తెలిపారు. ఇందులో భాగగా సోమవారం 14వ డివిజన్ పరిధిలోని తన స్వగృహం ఎదుట రోడ్డుపై చెత్త పారబోసి నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాను ఎన్నికైన డివిజన్‌లో నగరపాలక సంస్థ సిబ్బంది ఇంటింటి చెత్త సేకరణ చేయకపోవడంతో కార్పొరేటర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి వద్దకు చెత్త సేకరణ ట్రాక్టర్ రాకపోతే ప్రజలు కూడా చెత్తను రోడ్డు మధ్యలో వేసి నిరసన తెలిపారు. ఇందుకు స్పందించిన మేయర్, కమిషనర్ క్లాప్ ఆటోల స్థానంలో ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసి ఇంటింటి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో ప్రజల సహకారంతో నగరపాలక సంస్థ కార్యాలయంలోనే చెత్తను తెచ్చి వేస్తామని హెచ్చరించారు

రోడ్డుపై చెత్త వేస్తున్న వైసిపి కార్పొరేటర్ అబుసాలేహా

551, 57, 132 జీవోలు అమలు చేయాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ పంచాయతీ కార్మికుల సంక్షేమాభివృద్ధికి సంబంధించిన 551, 57, 132, 142, 680 జీవోలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ వారీ పథకాల అమలుతో పాటు ప్రతి ఏటా టెండర్ల విధానం ద్వారా నియామకాలు జరపాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను మల్టిపర్పస్ వర్కర్‌గా పరిగణించి రూ.10 వేలు తక్కుక కాకుండా చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు మాదిరిగానే విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు రూ.21 వేలు, రూ.24 వేలు వేతనాలు చెల్లిస్తున్నారని, గ్రామ పంచాయతీ కార్మికులకు అలాంటి వేతనాలే చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ నాయకులు ఆదినారాయణ, రామాంజినేయులు, నల్లప్ప, ప్రకాష్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం : మాజీమంత్రి శైలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని మాజీమంత్రి సాకే శైలజనాథ్ పిలుపునిచ్చారు. మండల వైసిపి నాయకులు సోమవారం అనంతపురంలో శైలజానాథ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులతో మాటామంతి నిర్వహించారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, పెద్ద కొండయ్య, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

శైలజానాథ్‌ను సన్మానిస్తున్న బుక్కరాయసముద్రం నాయకులు

జలవనరుల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సునీత

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పరిటాల సునీత

అనంతపురం రూరల్ : జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హంద్రీనీవా పరిధిలో భూగర్భజలాలు అడుగంటకుండా చెరువులకు నీరు అందించాలని కోరారు. రైతుల బాధలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవడంతోపాటు జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్నాకే ముందుకెళ్తామని హామీ ఇచ్చారు.

డంపింగ్ యార్డును తొలగించాలని వినతి

అనంతపురం : అనంతపురం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, నాయకులు ఉపసర్పంచు మసూద్‌వలి, సిపిఎం నగర కమిటీ సభ్యుడు వెంకటనారాయణ, శ్రీనివాసులు, ఫక్రుద్దీన్, సాదిక్‌వలి, షేక్షావలి, మహాదేవనగర్ కాలనీ వాసుసులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు ఏవీ?

నిబంధనలు పాటించని యాజమాన్యాలు-ఆందోళనలో వినియోగదారులు

పెద్దవడుగూరు సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

బతుకుబండి నడవాలంటే నడిపే బండి ముందుకు సాగాలి.. బండి కదలాలంటే ఇంధనం కావాలి.. ఈ ఇంధనం నింపే పెట్రోల్ బంకుల్లో యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొలతల్లో అనేక రకాలుగా మోసం చేస్తున్నా.. తూనికలు, కొలతల అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లుత్తుతున్నాయి.

సౌకర్యాలు లేకుండా ఉన్న పెట్రోల్ బంకు

పెద్దవడుగూరు మండలంలో 11 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిల్లో సగం శాతం పెట్రోల్ బంకుల్లో మౌలిక సౌకర్యాలు అమలు కావడం లేదు. పెట్రోల్ బంకులకు అనుమతి మంజూరు చేసేటప్పుడు యజమాలు 10 నియమాలను ఖచ్చితంగా పాటిస్తామని, అన్ని సౌకర్యాలు ఉండే విధంగా బంకులు నిర్వహిస్తామని రాత పూర్వకంగా రాసి ఇస్తారు. అయితే కేవలం కాగితాలకు నిబంధనలు పరిమితమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా బంకుల యజమానులు వినియోగదారులకు ఎయిర్ మిషన్ ఏర్పాటు చేసి ఉచితంగా ఎయిర్ అందించాల్సి ఉంటుంది. అలాగే ప్రథమ చికిత్స కోసం ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేసి అందులో వాడే మందులపై గడువు తేదీ తప్పకుండా ఉండాలనే నిబంధన ఉంది. గడువు తేదీ అయిపోతే వాటిని బాక్స్ నుంచి తొలగించాలి. తాగునీరు, ఉచిత ఫోన్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫిర్యాదు బాక్స్, పెద్ద అక్షరాలతో ధరల పట్టిక, ఫైర్‌సేఫ్టీ డివైజర్స్, బిల్లు ఇవ్వడం, క్వాంటిటీ, క్వాలిటీకోసం ఐదు లీటర్ల క్యాన్ వంటివి ప్రతిబంకులో ఏర్పాటు చేయాలి. అయితే పెట్రోల్ బంకుల్లో ఆయా నిబంధనలు ఏవీ పాటించడం లేదని వినియోగదారులు అంటున్నారు. దీనికితోడు కొంతమంది పెట్రోల్ బంకుల నిర్వాహకులు వినియోగదారులతో దురుసుగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. తద్వారా వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి పెట్రోల్ బంకును ఆకసిక్మంగా తనిఖీలు చేసి ప్రభుత్వం నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.

తహశీల్దార్‌ను అడ్డుకున్న మహిళలు

రోడ్డు సమస్య పరిష్కరించాలని నిలదీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఆరు వరుసల రహదారి నుంచి గ్రామంలోకి రోడ్డు వేయాలని మండల పరిధిలోని రోటరీపురానికి చెందిన మహిళలు తమ పిల్లలతో కలిసి తహశీల్దార్ పుణ్యవతిని సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యంగా రైతులు పొలాలకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు మహిళలు ససేమిరా అన్నారు. దారి సమస్యను ఇప్పుడే పరిష్కరించాలని భీష్మించుకుని కూర్చున్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ తహశీల్దార్‌ను అడ్డుకున్నారు. ఎట్టకేలకూ దారి సమస్యను పరిష్కరించడంతో ఆందోళన విరమించారు.

తహశీల్దార్‌ను అడ్డుకుని నిరసన తెలుపుతున్న మహిళలు

సిఐటియు కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని సిఐటియు కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. మౌలిక వసతులు కల్పించడంలో అధికారుల అలసత్వాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు కాలనీవాసులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం ఆలూరు రోడ్డులోని సిఐటియు కాలనీలో నిరుపేదలు గృహాలు నిర్మించుకుని జీవనం చేస్తున్నారన్నారు. అయితే ఆకాలనీలో మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకూ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. మౌలిక వసతులు కల్పించాలని ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా, మున్సిపల్ కార్యాలయం ముందు నిరసనలు చేసినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్లా, ఓబులేసు, బాషా, సూరి, కాలనీ నాయకులు ఈరన్న, రాము, రవి, నజరుద్దీన్, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు సుగుణ, లావణ్య, లక్ష్మి, మహాలక్ష్మి, శాంతమ్మ, భాగ్యమ్మ, సరోజ, జ్యోతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, సిఐటియు కాలనీవాసులు

సిపిఎం కార్యకర్త ఖాజా ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం చేసిన ప్రజాపోరాటాల్లో తనదైన పాత్ర పోషించిన మంచి కార్యకర్తగా సేవలందించిన ఖాజా ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప అన్నారు. ఖాజా వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒ.నల్లప్ప మాట్లాడుతూ ఖాజా పూర్తి కాలం కార్యకర్తగా పని చేశారని తెలిపారు. తుది శ్వాస వరకు పార్టీలోనే ఉండి సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, ముత్తుజ, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు వెంకటేష్, శీన, ఐద్వా నాయకురాలు చంద్రిక, అశ్విని, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గిరి, ఫక్రు, ఇస్మాయిల్, ఉన్నరప్ప తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గేట్స్ విద్యార్థులకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-గుత్తి

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను చూపి ఉత్తమ అవార్డును దక్కించుకున్నారు. హైదరాబాదులోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్"అనే కాన్ఫరెన్స్ లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న సాంకేతిక విద్యాసంస్థల విద్యార్థులు హాజరై 450 పేపర్లు ప్రజెంట్ చేశారు. అందులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న ఈసిఈ విద్యార్థులు అరవింద్ కుమార్, గణేష్ రెడ్డి ప్రజెంట్ చేసిన "ఐఓటి బెస్ట్ స్మార్ట్ హెల్మెట్ ఫర్ బైక్ టాక్సీ రైడర్స్"అనే పేపర్ కు ఉత్తమ అవార్డును ఈవెంట్ కోఆర్డినేటర్లు అందజేశారు. దీంతో సోమవారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ అవార్డు పొందిన విద్యార్థులను కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి,ఎండి రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్,ఇసిఇ హెచ్‌ఓడి డాక్టర్ ప్రవీణ్ అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

జెఎన్‌టియు విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొన్న జెఎన్‌టియు ఎంబిఎ విద్యార్థులు ఆర్.జాహ్నవి, పి.శ్రీనిధిని విశ్వవిద్యాలయం ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు మంగళవారం స్థానిక వర్సిటీలో అభినందించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ మీరు చేసిన కృషి, సాంస్కృతిక సమగ్రతను ప్రోత్సాహించడంలో కీలకపాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువత వ్యక్తిత్వ వికాసం, విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఎంతగానో సహాయపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఎంబిఎ విభాగాధిపతి బి.చంద్రమోహనరెడ్డి, బిసి లక్ష్మన్న, పి.జయరామిరెడ్డి, పి.విశ్వనాథ్, జాకీర్‌హుసేన్, పి.శ్రవణ్‌కుమార్, కె.శ్రీలిత, రామకృష్ణ, నాన్ టీచింగ్ స్టాఫ్ కృష్ణప్రసాద్, నగేష్ అభినందనలు తెలిపారు.

ఎంబిఎ విద్యార్థినులను సన్మానిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

'బన్సల్ క్లాసెస్' కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సంగమేశ్వర సర్కిల్ ఉన్న ఎస్‌బిఐ ట్రెజరీ బ్యాంకుపైన మూడవ అంతస్తులో రాజస్థాన్ కోటావారి బన్సల్ క్లాసెస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన బన్సల్ క్లాసెస్ కాలేజీ నూతన బ్రాంచును సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి బన్సల్ క్లాసెస్‌కి చెందిన ఎండి, సిఇఒ సమీర్, హెచ్‌ఆర్ స్పార్ష్, అకాడమిక్ రవిప్రతాప్‌సింగ్, కదిరి బ్లూమూన్ విద్యాసంస్థ శివశంకర్, అనంతపురం జిల్లా డైరెక్టర్ మంజునాథ్ రెడ్డి, హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఐఐటి, జెఇఇ నీట్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలన్న లక్ష్యంతో అనంతపురంలో బన్సల్ క్లాసెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యా సామర్థ్యాలు కలిగిన అధ్యాపకుతో విద్యా బోధన చేయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు తక్కువ ఫీజుతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం బన్సల్ క్లాసెస్ బ్రాంచు మేనేజర్ ఎస్ఆర్ జయచంద్ర, కరస్పాండెంట్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న బన్సల్ క్లాసెస్‌కి సంబంధించిన ప్రతినిధులు

పరీక్షల సామగ్రి వితరణ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గుండిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం పరీక్షల సామగ్రిని అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సరస్వతి పూజ సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్, జామెంట్రీ బాక్స్, రెండు పెన్నులును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభాషిని, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్‌లో మోడల్ స్కూల్ ఛైర్మన్ ఇదాయతుల్లా అధ్యక్షతన వజ్రకరూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు టెన్త్ విద్యార్థులకు పరీక్షలు ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, మండల విద్యాధికారి ఎర్రిస్వామి, సామాజిక కార్యకర్తలు బెంజిమెన్, మల్లికార్జున, పట్టా ఖాజీపీరా, పూర్వ విద్యార్థులు రమేష్‌కాంత్, మన్యం అనిల్, సుకన్య, రామాంజనేయులు, ఎర్రిస్వామి, ధర్మరాజు, రంగస్వామి, హరినాథ్, మాజీ ఎంపిటిసి రామాంజనేయులు, శ్రీనివాసులు, ఐకెపి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE (Additional Judicial Magistrate of First Class) ANANTHAPURAMU

O.S.No.1893/2023

Between :

Chennuru Bharghava S/o Late C.Nallaiah aged about 26 years, Hind., resident of Harpana Halli, Vijayanagara District Karnataka State ...**Plaintiff**

And

1.Smt. Chennuru Manjula.W/o Late Chennuru Nallaiah agad about 46 years Hindu residing at D.No:6-4-851, Maruthi Nagar, Ananthapararamu.

2.Chennuru Devaraju S/o Late C.Nallaiah agad 24 years residing at Maruthi Nagar, Ananthapararamu. ...**Defendants**

Notice To D1 & D2

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా ప్రతివాదులైన **D1 శ్రీమతి చెన్నూరు మంజుల W/o లేట్ చెన్నూరు నల్లయ్య D2 చెన్నూరు దేవరాజు S/o చెన్నూరు నల్లయ్య** మీరు కోర్టుకు హాజరు నిమిత్తం పై కోర్టు నందు 27/02/2025వ తేది వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గం॥లకు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కోర్టువారు మీ పరోక్షము నందు తీర్మానించెదరు.

(By order of the court)

జగన్ అయ్యాంగార్
అడ్వకేట్, అనంతపురం.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిఐటియు పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు అధ్యక్షతన సోమవారం స్థానిక మున్సిపల్ ప్రాంతీయ అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగావారు మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ కార్మికులకు 12 పిఆర్‌సి అమలు చేయాలని, బకాయి ఉన్న మూడేళ్ల సరెండర్ లీవ్‌లతోపాటు, డిఎలు, ఇంక్రిమెంట్లు, జిపిఎఫ్ అకౌంట్ ఓపెన్ చేయాలని కోరారు. జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ కార్మికులపై కక్ష సాధింపులు ఆపాలని, మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, కార్మికులందరికీ స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులందరూ ఆందోళనలు, పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, తిరుమలేశు, మహిళా కన్వీనర్లు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, తాడిపత్రి అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, జుబేరు, గుత్తి సూరి, రాజా, గుంతకల్లు జగదీష్, నరసయ్య, రాయదుర్గం, రాము, మల్లేష్, కళ్యాణదుర్గం వన్నూరుస్వామి, శివ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

శివాలయాల వద్ద సౌకర్యాలు కల్పించండి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శివాలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. సోమవారం నగరంలోని 1వ రోడ్డులో ఉన్న శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, లైటింగ్, తాగునీటితోపాటు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్‌భూషణ్, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, ఇఇ రమేష్‌బాబు, ఆలయ ప్రతినిధులు నరేంద్ర, రాజు, మునిస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

11 స్థానాలు వచ్చినా మారని జగన్ తీరు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతోనూ, స్వార్థ పూరిత పాలన సాగించిన జగన్‌రెడ్డిని ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేసినా ఆయన తీరులో మార్పు రాలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీని బాయ్‌కాట్ చేసిన అంశంపై తీవ్రంగా స్పందించారు. జగన్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఆయన ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. మంచి చేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేస్తూ, ఏదో ఒక అలజడి సష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఆయనకు ప్రజలన్నా, ప్రజాస్వామ్యం అన్నా, ఎన్నికల కమిషన్ నిబంధనలన్నా లెక్కలేదన్నారు. ప్రజలు వైసిపికి ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా కూడా ఆయనకు బుద్ధి రాలేదన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగలడం ఏంటని నిలదీశారు. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి వారి దిగుజారుడుతనానికి నిదర్శనంగా కనిపించిందన్నారు. ఎవరైనా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాడటం చూస్తుంటాం కానీ..ప్రతిపక్ష హోదా కోసం పోరాడే వారిని ఇప్పుడే చూశామన్నారు. జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యలపై భాధ్యత లేదన్నారు. ప్రజా సమస్యల కన్నా జగన్‌కు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? అంటూ నిలదీశారు. ప్రతిపక్ష హోదా ఒకరిస్తే వస్తుందా అంటూ ప్రశ్నించారు. సభ్యత్వాలు రద్దవుతాయని హాజరు కోసం అసెంబ్లీకి వచ్చినట్టు ఉందని కామెంట్ చేశారు.

నాలుగేళ్లలో శివాలయం అభివృద్ధిపై ఎందుకు మాట్లాడలేదు..

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

వైసిపి అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఏనాడైనా నగరంలోని 1వరోడ్డులో ఉన్న శివాలయం అభివృద్ధి మాట్లాడావా..? అని వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి నగర మేయర్ మహమ్మద్ వసీంను సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాలాధారులకు మొదట రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో భిక్ష ఏర్పాటు చేసిన సందర్భంలో ఆలయ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి శివాలయం అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యేకు మంచిపేరు వస్తుందేమోనన్న భయంతో మేయర్ వసీం శివాలయం సందర్శించి కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా మేయర్ వసీం చేస్తున్న హడావిడిని తగ్గించుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ సెక్రటరీగా వై.రంగస్వామి బాధ్యతల స్వీకరణ

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శిగా వై.రంగస్వామి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. దీంతోపాటు మడకశిర నగర పంచాయతీ ఎఫ్ఎసి కమిషనర్‌గా కూడా కొనసాగనున్నారు. ప్రస్తుతం రంగస్వామి కమిషనర్‌గా కొనసాగుతూ అదనంగా కార్పొరేషన్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో రెండు పడవలపై ప్రయాణం చేయనున్నారు.

'శ్రీహరికోట'లో ఎస్ఆర్ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాసముద్రం మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు సోమవారం నెల్లూరు జిల్లాలో ఉన్న శ్రీహరి కోట అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా ఉపగ్రహం, సాంకేతికత నైపుణ్యం, ఉపగ్రహాల నిర్మాణ శైలి, ప్రయోగాత్మక పరిశీలనలపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉపగ్రహాల గురించి తెలుసుకోవడం చాలా అవసరమని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి.వీరప్రకాష్ తెలిపారు.

శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో ఎస్ఆర్ఐటి విద్యార్థులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం : ఇటీవలీ కాలంలో మితిమీరిన సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని పోలీసులు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ సురక్ష వాహనం వద్ద ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి.. వాటిని ఎలా ఎదుర్కోవాలన్న విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాన్ని పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విషజ్వరాలపై అవగాహన

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో జ్వరం వచ్చిన వారికి తప్పక రక్తపూతలు తీయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

యాడికి : లయన్స్ లియో క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు సహకారంతో సోమవారం మండల పరిధిలోని రాయలచెరువులో లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో 60 మందికి పరీక్షలు చేయగా 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చల్లా సూర్యనారాయణ, చాటట్ ప్రెసిడెంట్ రవిప్రసాద్, లయన్ ఇస్మాయిల్, అల్లాబకాష్, శేషానందరెడ్డి, మురళీకృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'అనంత'ను కలిసిన వైసిపి నాయకులు

అనంతపురం : వైసిపి బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్య, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మదన్‌మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచక పాలనను ప్రజలకు వివరిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అనంత సూచించారు.

టిబి నిర్ధారణ పరీక్షలు చేయించుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ టిబి పరీక్షలు చేయించుకోవాలని టిబి యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణ సూచించారు. ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళ్యాణదుర్గం ఎన్‌జిఒ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక వివక్ష చూపకుండా అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ గళ్ల పరీక్ష చేయించుకుని ఒకవేళ నిర్ధారణ అయితే ఆరు నెలలు మందులు వాడితే పూర్తి ఆరోగ్యవంతులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిబి హెచ్‌వి తేజస్విని, పిపిఎంఎ తిమ్మరాజు, వైద్యాధికారులు డాక్టర్ విజయేంద్ర, డాక్టర్ ప్రత్యూష, ఆర్ఇడిఎస్ మహేష్ కిరణ్, ఎంపిహెచ్ఇఒ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపిహెచ్ఎస్‌లు భాగ్యలక్ష్మి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'పై అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై ఇస్తున్న శిక్షణ సోమవారం 6వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్ ఎం.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ రీసోర్స్‌పర్సన్లు తిప్పయ్య, ఈశ్వరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు షాహిదాబేగం, శ్రీదేవి, కృష్ణవేణి, పుష్పావతి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యల్లనూరు : 120 రోజుల శిక్షణ జ్ఞానజ్యోతిలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రైమరీ సెక్షన్ పరిధిలో పిల్లలకు ఎలా అభ్యసన చేయాలన్న దానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమ్మ, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన తర్వాత అంగనవాడీ సెంటర్ నుంచే పై చదువులకు పంపించడాన్నే గ్రాడ్యుయేషన్ డే అని పిలుస్తారన్నారు. ప్రతిఒక్కరూ అంగన్వాడీ సెంటర్లలోనే చదివించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, డిఆర్‌పిలు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పూర్వ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను తప్పనిసరిగా నిర్వహించాలని కృష్ణానాయక్, ఓబులపతి సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇసిసిఎ డే, గ్రాడ్యుయేషన్ డేతోపాటు పాఠశాల సంసిద్ధత మేళా, తదితర విషయాలపై డిఆర్పిలు అర్చన, రామాంజనేయులు, జగదీష్ బోధించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రెండు సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగుల సర్టిఫికెట్లు పరిశీలన

ఉరవకొండ : వికలాంగ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను సోమవారం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించారు. సత్యసాయి జిల్లాకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ లక్ష్మీరామ్ ధ్రువీకరణ పత్రాలతోపాటు అంగవైకల్యాన్ని పరిశీలించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ప్రారంభం

ఉరవకొండ : మండలంలోని చాబాల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సర్పంచ్ మల్లెల జగదీష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సౌకర్యార్థం పుట్టిన తేదీలు, పేర్లు నమోదు, ఆధార్ సవరణల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, చంద్రశేఖర్, డిజిటల్ అసిస్టెంట్ రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు పర్మినెంట్ హెచ్‌ఎంను నియమించాలి

ఉరవకొండ : ఉరవకొండ ఎస్‌కె ప్రభుత్వ హైస్కూల్‌కి పర్మినెంట్ హెచ్‌ఎంను నియమించాలని హైస్కూల్ కమిటీ ఛైర్మన్ బి.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా పర్మినెంట్ హెచ్‌ఎం లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్చి 17వ తేదీ నుంచి 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు లేకపోవడం శోచనీయమన్నారు. కావున విద్యాశాఖ అధికారులు స్పందించి హైస్కూల్‌కు ప్రధాన ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణకు చర్యలు

బెలుగుప్ప : ప్రభుత్వ నిబంధనలు మేరకు క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ షర్మిల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు నెంబర్ 30 మేరకు ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ పథకం 2025 (రెగ్యులరైజేషన్ స్కీమ్-2025) కింద అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇల్లు కట్టుకున్న వారు పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఉద్యానవనశాఖ పథకాలపై అవగాహన

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలపై అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల, నివారణపై కళ్యాణదుర్గం విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త యుగంధర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ, ఆర్ఎస్‌కె అధికారి, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సికి చేరుకున్న ప్రశ్నపత్రాలు

ప్రశ్న పత్రాలను దింపుతున్న దశ్యం

యల్లనూరు : మార్చి 3 నుంచి 8వతేదీ వరకూ జరగనున్న 1 నుంచి 9వ తరగతి వరకూ ఎస్ఎఎంపి 4 పరీక్షపత్రాలతో పాటు, 10వ తరగతి గ్రాండ్ టెస్ట్ ప్రశ్నపత్రాలు సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

చెత్తసంపద కేంద్రాల పరిశీలన

యల్లనూరు : మండలంలోని వివిధ పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన ఎస్‌డబ్ల్యూపిసి చెత్త సంపద కేంద్రాలను అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాతపల్లి, 85 నిట్టూరు, మెడికర్తి, కాచర్ల కుంట, వేములపల్లి గ్రామాల్లో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రాలతోపాటు మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వంశీగోకుల్‌రెడ్డికి సన్మానం

శింగనమల : వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులైన తరిమెల వంశీగోకుల్‌రెడ్డిని సోమవారం అనంతపురంలోని నివాసంలో మండల వైసిపి నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గోకుల్‌రెడ్డి వారు మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు నూర్ మహమ్మద్, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యులు నల్లప్ప, వైసిపి విద్యార్థి విభాగం మాజీ నియోజకవర్గ అధ్యక్షులు జెల్లీ గోపీయాదవ్, బెస్త చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గదుల వేలంపాట

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయానికి చెందిన 8 గదుల వాణిజ్య సముదాయానికి సోమవారం నిర్వహించిన వేలంపాట సజావుగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో ఎంపిడిఒ కొండన్న వేలంపాట నిర్వహించారు. ముందుగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రూ.20వేలు డీడీలు చెల్లించిన వారికి నిబంధనల మేరకు గదుల వేలంపాటలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. 4వ నెంబర్ గదిని పాటదారులు అత్యధికంగా రూ.7600కు వేలం పాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు రవిచంద్ర, మహేశ్ పాల్గొన్నారు.

సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

పెద్దవడుగూరు : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఈనెల 28న పెద్దవడుగూరులో ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని మండల విద్యాధికారులు రాముడు, గురుప్రసాద్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో చిత్రచేడు, లక్షుంపల్లి, పెద్దవడుగూరు, క్రిష్టిపాడు, కెజిబివి, దిమ్మగుడి, వీరన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతోపాటు సైన్సు, లెక్కల సబ్జెక్టు ఉపాధ్యాయులుతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. మండల సైన్సు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని ఇందుకు ప్రతి పాఠశాల నుంచి తోడ్పాటు అందించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

కంకర మిషన్ రాళ్లు పడి కూలీ మృతి

మృతిచెందిన సురేంద్ర

గుత్తి : కంకర క్రషర్ మిషన్‌లోని రాళ్లు పడి ఓ కూలీ మృతిచెందిన ఘటన గుత్తి మండలం జక్కలచెరువు గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన మునగాల సురేంద్ర (34) జక్కలచెరువు గ్రామ సమీపంలో ఉన్న శివసాయి స్టోన్ క్రషర్‌లో కూలిపనికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో కంకర క్రషర్‌లోని మిషన్‌లోకి బండ రాళ్లు వేస్తుండగా పైన ఉన్న రెండు రాళ్లు పడ్డాయి. గమనించిన తోటి కూలీలు రాళ్లను తొలగించి ఆటోలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. సురేంద్ర మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య ప్రమీలా, కుమారుడు త్రివిక్రమ్ ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.సురేష్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై ఛీటింగ్ కేసు

యల్లనూరు : కడప జిల్లా లింగాల మండలం లింగాల గ్రామనికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిపై పోలీసులు సోమవారం ఛీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని పెద్ద మల్లేపల్లి గ్రామానికి చెందిన మాధవి తన కుమారులతో కలిసి బెంగళూరులో నివాసం ఉంటోంది. ఆమెకు పెద్దమల్లేపల్లి గ్రామ రెవెన్యూ లో సర్వే నెం 1/127లో 3.5ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఎకరా రూ.9.10 లక్షల చొప్పున వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డికి 3.5 ఎకరాల పొలాన్ని రూ.31లక్షలకు విక్రయించింది. ఈమేరకు అగ్రిమెంట్ రాసుకున్నారు. నవంబర్ నెలలో తాడిపత్రి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించు కున్నాడు. అయితే డబ్బులు అంతా అక్కడికి తెచ్చినట్లే తెచ్చి ఇవ్వకుండా వెళ్లి పోయారని సిఐ సత్యబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఐ వెంకట నరసింహలుకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.